సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 27 । ఫిబ్రవరి । 2023



కండలేరులో 45.094 టీఎంసీలు

రాపూరు: జలాశయంలో ఆదివారం 45.094 టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయి. సత్యసాయిగంగ కాలువకు 1,210, పిన్నేరు వాగుకు 100, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిజ్‌కు 50, హైలెవల్ స్లూయిజ్‌కు 140 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు చెప్పారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,500
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,136
3 శాతం జీఎస్టీతో	రూ.5,290
నవర (8గ్రా)	రూ.42,320

గరిష్టం/కనిష్టం
33.0 /22.5

వాతావరణం

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతల్లో కాస్త తగ్గుముఖం పట్టాయి. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంది. సోమవారం వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ 59 శాతం ఉంది.

న్యూస్‌రీల్

సోమశిలలో 62.04 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం నాటికి 62.044 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 60 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. పెన్నార్‌డెల్టాకు 200, ఉత్తర కాలువకు 703, దక్షిణ కాలువకు 400, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 98.318 మీటర్ల నీటి మట్టం ఉంది.

రౌడీ షీటర్లలో సత్ప్రవర్తన రావాలి

సైదాపురం: సత్ప్రవర్తన రావాలని ఎస్‌ఐ పి.నాగబాబు రౌడీ షీటర్లను హెచ్చరించారు. సైదాపురంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లు, అనుమానితులకు ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇక నుంచి గ్రామాల్లో మీ కారణంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఆయన కోరారు. నడవడిక మార్చుకుని సమాజంలో మంచిపేరును తీసుకుని రావాలని కోరారు.

ముత్యాలమ్మ జాతరపై సమీక్ష

చిల్లకూరు: మార్చి 14 నుంచి నాలుగు రోజుల పాటు తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో జరిగే జాతరకు సంబంధించి ఏర్పాట్లపై ఈనెల 28న సమీక్ష నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. తూర్పుకనుపూరు దేవస్థానంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగే జాతర సమీక్షకు మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

ముత్యాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి వెండి చీరతో అలంకరణ చేశారు. ఆలయ ఆవరణలో భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

చెంగాళమ్మ సేవలో ద్వారకా తిరుమల ఈఓ

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ జాయింట్ కమిషనర్, ఈఓ వి.త్రినాథరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి వారికి ఘన స్వాగతం పలికి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం అమ్మవారి వద్ద వారికి ప్రత్యేక పూజలు చేయించి వేదపండితుల ఆశీర్వచనాలతో ఆలయ మర్యాదలతో వారిని సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్



నారాయణ కళాశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌ఐఓ వరప్రసాదరావు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జనరల్‌కు సంబంధించి 87 కేంద్రాలు, ఒకేషనల్‌కు సంబంధించి 11 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ నిర్వహించారు. జనరల్‌కు 3,383 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 3,309 మంది హాజరయ్యారు. 74 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 788 మందికి 742 మంది హాజరయ్యారు. 46 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన ప్రాక్టికల్స్‌కు జనరల్ 2,172 మందికి 2,094 మంది హాజరు కాగా, 78 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రాష్ట్ర ఇంటర్ బోర్డు అబ్జర్వర్ సుధాకర్ ఆత్మకూరులో ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతున్న కళాశాలలను తనిఖీ చేశారు. ఆర్‌ఐఓ వరప్రసాదరావు నెల్లూరులోని నాలుగు కళాశాలలతో పాటు కోట, విద్యానగర్, చిట్టమూరు, దొరవారిసత్రం, సూళ్లూరుపేటలోని కళాశాలలను పరిశీలించారు. డీవీఈఓ మధుబాబు 12 కేంద్రాలను హైపవర్ కమిటీ సభ్యులు, డీఈసీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐఓ వరప్రసాదరావు మాట్లాడుతూ ప్రాక్టికల్స్ పరీక్షల్లో ఎవరైనా సిబ్బంది అవకతవకలకు పాల్పడితే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తోడేరు.. కన్నీరు..

పడవ బోల్తా పడి ఆరుగురు గల్లంతు



చెరువు వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ విజయారావు

తోడేరు కన్నీరు మున్నీరుగా రోదిస్తోంది. అందరూ ఒకే గ్రామానికి చెందిన యువకులు. పదహారేళ్ల నుంచి ఇరవై ఏళ్లలోపు వారే. కొందరు చదువుకునే పిల్లలు, మరికొందరు వ్యవసాయ పనులకెళ్తున్నారు. ఆదివారం కావడంతో వీరంతా చెరువు నీటిలో నాటు పడవపై సరదాగా షికారుకెళ్లి ఆరుగురు గల్లంతయ్యారు. ఈ విషాదకర విషయం తెలిసి ఊరు ఊరంతా చెరువు వద్దకు చేరుకున్నారు. బిడ్డల ఆచూకీ తెలియక తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. తోడేరు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్వగ్రామం. అందరూ చుట్టు పక్కల ఇళ్లలోనే వారు కావడంతో ఊరంతా విషాదంలో మునిగిపోయింది. విషయం తెలిసి మంత్రి కాకాణి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. హుటాహుటినా స్వగ్రామానికి బయలుదేరారు.

నాటు పడవపై చెరువులో షికారుకెళ్లిన పది మంది యువకులు

- వారంతా ఒకే ఊరు
- రంగంలోకి దిగిన అగ్నిమాపక, పోలీసులు, గజ ఈతగాళ్లు
- రాత్రి ఏడు గంటల నుంచి ముమ్మరంగా గాలింపు చర్యలు
- బ్యాటరీ లైట్లు తెప్పించిన అధికార యంత్రాంగం
- ఘటనా స్థలికి చేరుకున్న ఎస్పీ విజయారావు, నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి
- హుటాహుటిన హైదరాబాద్ నుంచి బయలుదేరిన మంత్రి కాకాణి

పొదలకూరు: సరదా విహారం విషాదంగా మారింది. మండలంలోని తోడేరుకు చెందిన పది మంది యువకులు కొత్తచెరువులో నాటు పడవపై విహరించేందుకు వెళ్లారు. నడి చెరువులో నాటు పడవ అదుపు తప్పి బోల్తాపడింది. వీరిలో ఆరుగురు గల్లంతు కాగా, మరో నలుగురు ఈదుకుంటూ బయటపడ్డారు. వారిలో కొందరు ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు కూడా ఉన్నారు. శాంతినగర్‌కు సమీపంలో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో కొత్తచెరువు ఉంది. చెరువు మధ్య ప్రాంతం సుమారు 30 అడుగుల లోతు ఉంటుందని అంచనా. ఈ చెరువులో చేపలకు మేత వేసేందుకు నాటు పడవను ఏర్పాటు చేసుకున్నారు. అయితే గ్రామానికి చెందిన కొందరు యువకులు తరచూ పడవలో చెరువులోకి వెళ్లి విహరిస్తున్నారు. ఆదివారం కావడంతో సరదాగా చెరువు నీటిలో విహరించాలని ఆ నాటు పడవలో కలిసి భోజనాలు చేయాలని తీసుకుని చెరువులోకి వెళ్లారు. లోతైన ప్రాంతంలో ప్రమాదవశాత్తు పడవ బోల్తా పడడంతో యువకులు నీటిలో పడిపోయారు. ఈ ప్రమాదంలో గల్లంతైన ఆరుగురు యువకుల కోసం ఆదివారం రాత్రి 11 గంటల తర్వాత కూడా గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

ఊరు ఊరంతా చెరువు వద్దే..

ఆదివారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో తోడేరుకు చెందిన పముజుల బాలాజీ (20), బట్ట రఘు (20), అట్లా శ్రీనాథ్ (16), మన్నూరు కల్యాణ్ (30), చల్లా ప్రశాంత్‌కుమార్ (16), పాడి సురేంద్ర (16), ఏనుగు విష్ణు (18), ఎ.కిరణ్ (18), ఒంటేరు మహేంద్ర (20), ఒంటేరు మహేష్(19) చెరువులో నాటు పడవలో షికారుకు వెళ్లారు. చెరువు మధ్యలోకి వెళుతుండగా ప్రమాదవశాత్తు నాటు పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏనుగు విష్ణు, ఒంటేరు మహేంద్ర, ఒంటేరు మహేష్, ఎ.కిరణ్ ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరారు. మిగతా వారంతా గల్లంతయ్యారు. అందరిదీ ఒకే ఊరు కావడం, చుట్టుపక్కల ఉండేవాళ్లు కావడంతో ప్రమాదం విషయం తెలుసుకుని ఊరుఊరంతా చెరువు వద్దకు చేరుకుంది. చుట్టుపక్కల గ్రామస్తులు కూడా పెద్ద ఎత్తున చెరువు వద్దకు చేరుకున్నారు. గల్లంతైన యువకులు చెట్లను పట్టుకుని ఉంటారనే నమ్మకంతో క్షణక్షణం ఉత్కంఠగా నిరీక్షిస్తున్నారు. తల్లిదండ్రులు అయితే విషయం తెలియక గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. నీటిలో చిక్కుకున్న యువకులను కాపాడేందుకు వెళ్లిన తోడేరుకు చెందిన అట్ల వెంకటేశ్వర్లు నీరు తాగి అపస్మాకర స్థితికి చేరడంతో నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు.

ముమ్మరంగా గాలింపు చర్యలు

ప్రమాద విషయం తెలుసుకున్న తర్వాత పొదలకూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బందిని, గజ ఈతగాళ్లను రంగంలోకి దింపారు. ఈ ఘటన విషయం తెలిసేటప్పటికే చీకటి పడడంతో అప్పటి నుంచి చిమ్మ చీకట్లోనే గాలింపు చర్యలు చేపడుతున్నారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయులురెడ్డి, పొదలకూరు, కోవూరు సీఐలు సంగమేశ్వరరావు, రామకృష్ణారెడ్డి, ఎస్సై కరిముల్లా, తహసీల్దార్ ప్రసాద్‌తో సమీక్షించారు. చిమ్మచీకటి కావడం వల్ల గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడింది. ఎస్పీ రాకకు ముందే సీఐ, ఎస్సైలు గజ ఈతగాళ్లను నాటుపడవలో చెరువులోకి పంపి గాలించారు. ఇందుకోసం ప్రత్యేకంగా లైట్లను కూడా తెప్పించారు. నెల్లూరు ఆర్డీఓ మలోల ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

హుటాహుటినా బయల్దేరిన మంత్రి కాకాణి

తోడేరు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్వగ్రామం. ఆయన కేరళ రాష్ట్ర పర్యటన ముగించుకుని ఆదివారం హైదరాబాద్ చేరుకున్నారు. పడవ బోల్తా ఘటన సమాచారం తెలుసుకున్న వెంటనే రోడ్డుమార్గంలో తోడేరుకు బయలుదేరారు. మంత్రి స్వగ్రామం కావడంతో ఆయన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సహాయక చర్యలకు అధికారులను అప్రమత్తం చేశారు. గల్లంతైన యువకుల తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.



ఘటనా స్థలంలో గుమికూడిన గ్రామస్తులు



గాలింపు చర్యలపై చర్చిస్తున్న తహసీల్దార్, ఎస్సై

ఎన్నికల అక్రమాలు అరికట్టేందుకు స్క్వాడ్‌లు

- కలెక్టర్ చక్రధర్‌బాబు



నెల్లూరు(అర్బన్): వచ్చే నెల 13న జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ, నెల్లూరు స్థానిక సంస్థల ఎమ్మెల్సీల్లో అక్రమాలను అరికట్టేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రత్యేకంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని కలెక్టర్ చక్రధర్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగదు, మద్యం తరలింపు, ఇతర వస్తువుల పంపిణీపై పర్యవేక్షణ కోసం కందుకూరు, కావలి, ఆత్మకూరు, నెల్లూరు డివిజన్ల వారీగా ఈ ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ బృందాలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు ఓటర్లను ప్రలోభానికి గురి చేయకుండా నిరంతరం పర్యవేక్షిస్తాయని తెలిపారు. మద్యం, నగదు, ఇతర వస్తువుల తరలింపు, పంపిణీపై అందిన ఫిర్యాదులను నమోదు చేసి సరైన ఆధారపత్రాలు లేని వాటిని సీజ్ చేస్తామని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకునేందుకు జిల్లా ఎన్నికల అధికారికి ఈ బృందాలు సిఫార్సు చేస్తాయని తెలిపారు.

మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా సోషల్ మీడియాలో, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వస్తున్న వార్తలు, ప్రకటనలు, చెల్లింపు వార్తలు పరిశీలించేందుకు కలెక్టర్ చక్రధర్‌బాబు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్‌తో పాటు ప్రాంతీయ ఇంటర్మీడియట్ తనిఖీ అధికారి వరప్రసాద్ నోడల్ అధికారిగా ఉంటారు. జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి వెంకటేశ్వర ప్రసాద్‌తో పాటు మరో ముగ్గురు మీడియా నుంచి సభ్యులుగా ఉంటారు. ఎమ్మెల్సీలుగా పోటీచేస్తున్న అభ్యర్థులు, వారి తరఫున వ్యక్తులు ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు జారీ చేయాలనుకున్నప్పుడు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీకి వివరాలు అందజేసి ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజున ప్రింట్ మీడియాలో ప్రకటనలు ప్రచురించే ముందు ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంటుంది.

హైరిస్క్.. అయినా నోరిస్క్

ప్రైవేట్ ఆస్పత్రుల్లో కష్టమనే కేసులకు పెద్దాస్పత్రిలో పురుడు



నెల్లూరు పెద్దాస్పత్రి గర్భిణుల పాలిట వరంగా మారింది. కార్పొరేట్ ఆస్పత్రుల్లో హైరిస్క్ పేరుతో రూ.లక్షలు డిమాండ్ చేసే డెలివరీ కేసులే కాకుండా, తల్లీబిడ్డకు గ్యారెంటీ ఇవ్వలేమని చేతులెత్తేసిన డెలివరీ కేసులను సైతం జీజీహెచ్‌లో చాలెంజ్‌గా తీసుకుని ఉచితంగా సాధారణ కాన్పులు చేయించి రక్షణగా నిలుస్తోంది. పెద్దాస్పత్రిలో కాన్పుల కోసం అత్యాధునిక వైద్య పరికరాలు, సౌకర్యాలతోపాటు సీనియర్ గైనకాలజిస్టులను నియమించి గుండె, లివర్, రక్తహీనత వంటి సమస్యలతో ఉన్న గర్భిణులకు పురుడు పోసేందుకు ప్రతిష్టాత్మకంగా వైద్య సేవలు అందిస్తోంది.

- గుండె, లివర్, రక్తహీనత సమస్యలున్నా సాధారణ కాన్పులు
- జీజీహెచ్‌లో నైపుణ్యత ఉన్న సీనియర్ గైనకాలజిస్టుల సేవలు



పెద్దాస్పత్రిలోని ప్రసూతి విభాగం (మదర్ అండ్ చైల్డ్)



ఈ మహిళ పేరు పాములూరి చెంచమ్మ. విడవలూరు మండలం యలగాలమ్మగుంట కాలనీ. వయస్సు 23 ఏళ్లు. ఎస్టీ వర్గానికి చెందిన నిరుపేద మహిళ. ఈమె గర్భం దాల్చి కాన్పు కోసం కోవూరులోని సీహెచ్‌సీ (సామాజిక ఆరోగ్య కేంద్రం)లో అడ్మిట్ అయింది. అయితే అక్కడ కాన్పు చేశారు. అయితే మాయ బయటకు రాలేదు. గర్భాశయంలోనే ఉండి పోయింది. రక్తస్రావం అవుతోంది. బీపీ పడిపోతోంది. ఇలాంటి స్థితిలో ఆమెను నెల్లూరులోని పెద్దాస్పత్రి కాన్పుల విభాగానికి అక్కడి డాక్టర్లు రెఫర్ చేశారు. పెద్దాస్పత్రిలో ప్రసూతి విభాగానికి చెందిన డాక్టర్ భవాని ఆమెను పరిశీలించారు. బీపీ 80/40కు వచ్చేసింది. షాక్‌లోకి వెళ్లింది. రక్త పరీక్ష చేయగా కేవలం రెండు అంటే రెండే గ్రాములు ఉంది. ఇలాంటి తరుణంలో పేషెంట్‌ను బతికించడం కష్టం. పైగా బీపీ కంట్రోల్ తప్పింది. అయినా హెచ్‌ఓడీ డాక్టర్ గీతాలక్ష్మి ఆధ్వర్యంలో డాక్టర్ల బృందం కేసును చాలెంజ్‌గా తీసుకుని నాలుగు పాయింట్‌లు రక్తం, మరో రెండు పాయింట్లు ఎఫ్‌ఎఫ్‌పీ (రక్తం లాగే పని చేసే ద్రవం) ఎక్కించారు. మత్తు డాక్టర్ల సహకారంతో మాయను తొలగించారు. రెండు రోజుల వరకు డోపమిన్ (బీపీ మెయింటెనెన్స్) డ్రిప్ మీదనే చెంచమ్మ ఉంది. ఎట్టకేలకు మూడు రోజుల తర్వాత ఆమె నార్మల్ పొజిషన్‌కు వచ్చింది. ప్రస్తుతం పెద్దాస్పత్రి కాన్పుల విభాగంలో తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారు. డాక్టర్లు క్షణక్షణం ఆమెను పర్యవేక్షిస్తూ వైద్యం చేసి కాపాడారు.

అల్లూరు ప్రాంతానికి చెందిన మరో మహిళ వెంకటరమణమ్మకు ఐదో కాన్పు. ఆమెకు సైతం తీవ్రమైన రక్తహీనత ఉంది. కాన్పు కోసం పెద్దాస్పత్రికి వచ్చినప్పుడు పరిశీలిస్తే రక్తం 2 గ్రాములే ఉంది. పైగా రేర్ రక్త గ్రూపు ఏబీ పాజిటివ్. రక్తం దొరకలేదు. ఇలాంటి స్థితిలో సైతం కష్టపడి రక్తం సంపాదించి 4 పాయింట్లు రక్తం ఎక్కించి ఆమెకు నార్మల్ కాన్పు చేశారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఇంటికి చేరుకున్నారు. ఈ కేసులు ఉదాహరణ మాత్రమే. ఇలాంటి పలు రకాల రిస్క్ కేసులు అనేకం పెద్దాస్పత్రిలోని ఎంసీహెచ్ వార్డుకు వస్తున్నాయి.



ఈ మహిళ పేరు కొల్లు చాముండేశ్వరి. గూడూరు అశోక్‌నగర్. చిన్న వయస్సులోనే వివాహం జరిగింది. మూడో దఫా గర్భం దాల్చాక నెలలు నిండిన సమయానికి ఆమెకు కామెర్లు సోకాయి. బైలురూబిన్ 3.9 ఉంది. జ్వరం వచ్చింది. రక్తం సైతం 9 గ్రాములే ఉంది. ఉమ్మ నీరు పోయింది. ఇలాంటి స్థితిలో గూడూరులో పేరున్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కాన్పు కోసం వెళ్లింది. అక్కడ అడ్మిట్ చేసుకున్న డాక్టర్లు ఆమె పరిస్థితిని గమనించి అప్పటికప్పుడు డిశ్చార్జి చేశారు. మాతృసేవా పథకాన్ని నిర్వహిస్తున్నామని గొప్పగా చెప్పుకునే నెల్లూరులోనే పేరున్న ఓ కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్తే.. అక్కడి డాక్టర్లు గూడూరులో చూపించుకున్న వైద్య ప్రిస్క్రిప్షన్ చూసి అసలు అడ్మిట్ చేసుకోలేదు. ఇటువంటి దయనీయ స్థితిలో నగరంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (పెద్దాస్పత్రి)కి కాన్పు కోసం వచ్చింది. అక్కడ ఎంసీహెచ్ వార్డులో అడ్మిట్ చేసుకున్న డ్యూటీ డాక్టర్ స్వర్ణముఖి గర్భవతి చాముండేశ్వరిని పరీక్షించింది. ఉమ్మనీరు కూడా పోయి 24 గంటలు కావస్తోందని తెలుసుకుంది. కామెర్లతో పాటు అల్బుమిన్ పాజిటివ్ (యూరిన్‌లో ప్రొటీన్స్ పోవడం) వచ్చింది. వెంటనే తమ విభాగం హెచ్‌ఓడీ, ప్రొఫెసర్ డాక్టర్ గీతాలక్ష్మికి విషయాన్ని తెలిపింది. ఇన్‌ఫెక్షన్ సోకి పేషెంట్ సెప్సిస్‌లోకి పోయింది. నాడి కొట్టుకునే విధానంలో తేడా ఉందని గుర్తించి తిరుపతికి కేసును రెఫరల్ చేయాలని చూశారు. అంతలోనే వైద్య బృందం అప్రమత్తమైంది. తిరుపతి డాక్టర్లు చేయలేనిది మనం చేయలేమా అని ప్రశ్నించుకున్నారు. ముందుగా కార్డియాలజీ డాక్టర్ సలహా తీసుకున్నారు. అనంతరం రెండు ఎఫ్‌ఎఫ్‌పీ (రక్తంలాగే పనిచేసే ద్రవం) ఎక్కించారు. మరో బాటిల్ రక్తం ఎక్కించారు. హెచ్‌ఓడీ డాక్టర్ గీతాలక్ష్మి, మరో ప్రొఫెసర్ డాక్టర్ ఇందిర, డాక్టర్ ప్రమీలాదేవి, డాక్టర్ స్వర్ణముఖి, డాక్టర్ అనూరాధ, డాక్టర్ భవాని, డాక్టర్ కవిత, డాక్టర్ కవితా వసుంధర, డాక్టర్ లక్ష్మీప్రియ, డాక్టర్ ఇందిరాప్రియదర్శిని, డాక్టర్ రశీదా, డాక్టర్ కరుణ, డాక్టర్ మాధురి బృందం ఆమెకు వైద్యం చేశారు. ఆపరేషన్ చేస్తే డీఐసీ (ఇమ్యూనిటీ తగ్గి డెలివరీ తర్వాత రక్తం పోవడం) సోకే ప్రమాదం ఉందని అత్యంత కష్టపడి నార్మల్ డెలివరీ చేశారు. బిడ్డ బరువు 2.9 కిలోలు. తల్లి, బిడ్డను ఎట్టకేలకు కాపాడారు. ఈ నెల 24న డిశ్చార్జి చేశారు. తల్లీ, బిడ్డలను కాపాడినందుకు చాముండేశ్వరి కుటుంబం డాక్టర్లకు కన్నీటితో కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

నెల్లూరు (అర్బన్): ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. అందులో భాగంగా వైద్య పరికరాలు, మందులు సమకూర్చుతున్నారు. డాక్టర్లు, నర్సింగ్ పోస్టులు భర్తీ చేశారు. టీడీపీ ప్రభుత్వంలో నిత్యం డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది కొరత ఉండే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కాన్పులను సైతం ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావడంతో పెద్దాస్పత్రిలో ఉచిత వైద్యంతో పాటు ఆరోగ్య ఆసరా కింద కాన్పు అయిన మహిళకు డిశ్చార్జి అయ్యేలోపు ప్రభుత్వం నేరుగా రూ.4 వేలు నగదు సైతం బ్యాంకు ఖాతాలో జమ చేస్తోంది.

పెద్దాస్పత్రిలో ప్రసూతి విభాగం

నెల్లూరు పెద్దాస్పత్రిలో ప్రత్యేకంగా ప్రసూతి విభాగాన్ని తీర్చిదిద్దింది. అత్యాధునిక వైద్య పరికరాలతో పాటు సౌకర్యాలు ఏర్పాటు చేసింది. నిపుణులైన సీనియర్ గైనకాలజిస్టులను నియమించి కొతలే కాదు.. కాసులు ఖర్చులేని కాన్పులు చేస్తూ పేద కుటుంబాలకు అండగా నిలిస్తోంది. బీపీ, షుగర్, రక్తహీనత, గుండెజబ్బులు, లివర్ సమస్యలు, ఉమ్మనీరు పోవడం వంటి లక్షణాలతో వచ్చిన అత్యంత హైరిస్క్ గర్భిణులకు పురుడు పోసేందుకు ప్రైవేట్ ఆస్పత్రులు ముందుకురావడం లేదు. కార్పొరేట్ ఆస్పత్రుల డాక్టర్లు రూ.లక్షలు ఖర్చవుతాయి అని చెబుతూనే ప్రాణానికి గ్యారెంటీ లేదంటున్నారు. ఇలాంటి గర్భిణులకు తామున్నాం..ఒక్క రూపాయి ఖర్చులేకుండా ఉచితంగా వైద్యసేవలు చేస్తామంటున్నారు గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) గైనకాలజిస్ట్ డాక్టర్లు. ప్రైవేట్ ఆస్పత్రులు వద్దు పొమ్మంటే.. ప్రభుత్వ ఆస్పత్రి అక్కున చేర్చుకుంటూ తల్లీ బిడ్డలను కాపాడుతోంది.


పెరుగుతున్న కాన్పుల సంఖ్య

పెద్దాస్పత్రిలో ఒకప్పుడు కాన్పుల సంఖ్య తక్కువగా ఉండేది. రోజుకు ఏడెనిమిది కేసులు కూడా అయ్యేవి కావు. ఇప్పుడు రోజుకు సగటున 15 కేసుల వరకు వస్తున్నాయి. బదిలీల్లో భాగంగా తిరుపతి, ఇతర జిల్లాల నుంచి నిష్ణాతులైన గైనకాలజిస్టులు పెద్దాస్పత్రిలో జాయిన్ అయ్యారు. కాన్పుల సంఖ్య కూడా పెరుగుతోంది.

జీజీహెచ్‌లో గతేడాది కాన్పులు

నెల	కాన్పుల సంఖ్య
జనవరి	338
ఫ్రిబవరి	349
మార్చి	325
ఏప్రిల్	437
మే	395
జూన్	410
జూలై	359
ఆగస్టు	367
సెప్టెంబర్	415
అక్టోబర్	429
నవంబర్	445
డిసెంబర్	332
2023 జనవరి	293
ఫిబ్రవరి (ఇప్పటి వరకు)	230

రిస్క్ కేసులు ఎక్కువగా వస్తున్నాయి



ఇక్కడకు కాన్పు కోసం వస్తున్న వారిలో అధిక భాగం నిరుపేదలే. గర్భం దాల్చిన మహిళలు పౌష్టికాహారం తీసుకోవడం లేదు. ఏఎన్‌ఎంలు ఇచ్చే మందులు సక్రమంగా వాడడం లేదు. అందువల్లనే రక్తహీనత అధికంగా ఉంటోంది. తద్వారా ఎక్కువగా రిస్క్ కేసులు వస్తున్నాయి. అయినా ఇక్కడ నిష్ణాతులైన గైనకాలజిస్టులున్నారు. వైద్యం అందించి పురుడు పోస్తున్నాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు చేయించుకోండి.

– ప్రొఫెసర్ డాక్టర్ గీతాలక్ష్మి,
హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్, గైనకాలజీ

ఉద్యాన సాగుకు ఊతం

వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అన్నదాతలకు అన్ని విధాలుగా అండగా ఉంటోంది. అదే తరహాలో ఉద్యాన పంటలను నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులకు భరోసాగా నిలుస్తోంది. ఆయా పంటలు వేసిన వారు నష్టపోకుండా మద్దతు ధర కల్పించే విధంగా రైతులతో ప్రత్యేక గ్రూపులను ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పిస్తోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉద్యాన సాగుకు ఊపిరి పోస్తూ రైతులను ఉద్యాన పంటలను సాగుచేసే విధంగా ప్రోత్సాహాలను అందిస్తోంది.

- పంటలకు మద్దతు ధర కల్పించేలా చర్యలు
- రైతు ఉత్పత్తి సంఘాల ఏర్పాటు
- ఇప్పటికే ప్రారంభమైన సేకరణ ప్రక్రియ


కోవూరులో ఏర్పాటు చేసిన సేకరణ కేంద్రం

జిల్లాలో..

సేకరణ కేంద్రాలు : 25

కోల్డ్ స్టోరేజీలు : 5

నెల్లూరు(సెంట్రల్) : ఉద్యాన పంటలకు మంచి గిట్టుబాటు ధరలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవ తీసుకుంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాల పేరుతో ప్రత్యేక సంఘాలను ఏర్పాటు చేసింది. ఒక్కో సంఘంలో వంద మంది రైతులకు పైగా ఉంటారు. జిల్లాలో ఉద్యాన పంటలకు సంబంధించి ఆయా పరిధిని బట్టి సంఘాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఇప్పటికే 25 సంఘాలు ఏర్పాటు చేయగా వారితో ఉద్యానశాఖ అధికారులు సమావేశాలు ఏర్పాటు చేస్తూ తగిన సూచనలు సలహాలు అందిస్తున్నారు.

కోల్డ్ స్టోరేజీలు, సేకరణ కేంద్రాలు

జిల్లాలో ఉద్యాన పంటలకు సంబంధించి రైతు ఉత్పత్తి దారుల సంఘాల సభ్యులు రైతుల వద్ద గిట్టుబాటు ధరలకు పంటలను కొనుగోలు చేస్తారు. వీటిని ప్రత్యేకంగా గ్రేడింగ్ చేసి సుదూర ప్రాంతాల్లో విక్రయాలు చేసే విధంగా చేస్తున్నారు. పంటలను నిల్వ చేసుకునేందుకు సేకరణ కేంద్రాలు, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 25 సేకరణ కేంద్రాలు, 5 కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం కాగా కందుకూరు, కలిగిరి, అనంతసాగరం, అనుమసముద్రంపేట ప్రాంతాల్లో సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉద్యాన పంటలను సేకరిస్తున్నారు.

70 శాతం సబ్సిడీతో..

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన రైతుల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా సేకరణ కేంద్రాలను కూడా ప్రత్యేక రాయితీతో ఏర్పాటు చేస్తోంది. ఒక్కో సేకరణ కేంద్రం ఏర్పాటుకు రూ.15 లక్షలు కాగా అందులో రూ.11.25 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం రాయితీని అందిస్తోంది. కోల్డ్ స్టోరేజీ ఏర్పాటుకు రూ.12.50 లక్షలు కాగా అందులో ప్రభుత్వం రూ.9.37 లక్షలు రాయితీని ఇస్తోంది. వీటిని ఆయా సంఘాలు నడిపే విధంగా అటు రైతులకు మద్దతు ధరతో పాటు, ఇటు సంఘంలోని రైతులకు ఆదాయం వచ్చే విధంగా సహాయ సహకారాలు అందిస్తోంది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉద్యాన పంటలు వేసే రైతులు సేకరణ కేంద్రాల ఏర్పాటుకు ఉత్సాహంతో ముందుకు వస్తున్నారు. కోల్డ్ స్టోరేజీలు జిల్లాలో కలువాయి, సైదాపురం, బుచ్చిరెడ్డిపాళెం, అనంతసాగరం, కలిగిరి, ఏఎస్‌పేట ప్రాంతాల్లో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.


సేకరణ కేంద్రం వద్ద అధికారులు, గ్రూపు సభ్యులు

ఎంతో ప్రతిష్టాత్మకంగా చేస్తున్నాం



గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉద్యాన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహాన్ని ఇస్తోంది. అందులో బాగంగా రైతుల చేతనే ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే వాటి ద్వారా సేకరణ కేంద్రాలు కూడా ప్రారంభించాం. త్వరలోనే మిగిలినవి కూడా పూర్తి చేసి రైతులకు మద్దతు ధర కల్పించే విధంగా చేస్తున్నాం.

– సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

క్లుప్తంగా

నెల్లూరు బ్యారేజీలో యువతి మృతదేహం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సంతపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి నెల్లూరు బ్యారేజీ వద్ద నీటిలో ఓ యువతి మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించగా మానసిక సమస్యతో బాధపడుతున్న ఖాతీజాగా గుర్తించారు. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు.. నగరంలోని రంగనాయకులపేట ప్రాంతానికి చెందిన పఠాన్ సర్దార్‌ఖాన్ కుమార్తె ఖతిజుల్‌కుబ్రా అలియాజ్ ఖాతీజా(18) గత రెండు సంవత్సరాలుగా మానసిక పరిస్థితి బాగోలేక బాధపడుతూ ఉండేది. ఈ క్రమంలో ఇంటి నుంచి ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో యువతి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కాగా బ్యారేజీలో యువతి మృతదేహంపై సమాచారం అందుకున్న సంతపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా, తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. సర్దార్‌ఖాన్ జీజీహెచ్‌కు వెళ్లి మార్చురీలోని మృతదేహాన్ని చూసి తన కుమార్తె ఖాతీజాగా గుర్తించారు. మానసిక పరిస్థితి బాగోలేక తన కుమార్తె బ్యారేజీ నీటిలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటుందని మృతురాలి తండ్రి సర్దార్‌ఖాన్ పోలీసులకు తెలియజేశారు. ఈ మేరకు సంతపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సముద్రంలోకి వెళ్లి యువకుడి మృతి


కిషన్ మృతదేహం

బిట్రగుంట : సముద్రంలోకి వెళ్లిన ఓ యువకుడు గల్లంతై మృతిచెందిన సంఘటన తాటిచెట్లపాళెం తీరం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. బిట్రగుంట ఇన్‌చార్జి ఎస్సై ఆదిలక్ష్మి తెలిపిన సమాచారం మేరకు.. బోగోలు మండలం బిట్రగుంట దళితవాడకు చెందిన ననగిరి ప్రభుదాసు, కుమారి దంపతులకు ఇద్దరు కుమారులు. అందులో పెద్దవాడైన ననగిరి కిషన్(18) ఒంగోలులోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం కావడంతో స్నేహితులతో కలిసి సరదాగా సముద్రంలో ఈతకు వెళ్లారు. స్నేహితులు అందరూ సముద్రంలో మునిగి బయటకు వచ్చిన తరువాత టీషర్టుకు మట్టి అంటుకుందని కిషన్ సముద్రంలోకి వెళ్లాడు. ఇంతలో పెద్దగా రాకాసి రావడంతో అందుల్లో గల్లంతయ్యాడు. దీంతో అక్కడే ఉన్న స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించినా ఆచూకీ దొరక్కపోవడంతో వెంటనే పక్కనే ఉన్న మత్స్యకారులకు సమాచారం అందించారు. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తీరం వెంబడి గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుడ్లూరు : చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. ఈ సంఘటన మండలంలోని చేవూరులో ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. చేవూరు గ్రామంలో ఉన్న చెరువులో జాతీయ రహదారి వైపు యువకుని మృతదేహం నీటిలో తెలియాడుతుండటంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ప్రసాదరెడ్డి సిబ్బందితో కలిసి చెరువు వద్దకు వెళ్లి నీటి నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. యువకుని మృతదేహం గుర్తు పట్టడానికి వీలు లేకుండా ఉంది. మూడు రోజుల క్రితం చెరువులో పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు ఉండొచ్చు. మృతుడు నలుపు రంగు టీ షర్టు, షార్ట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తల్లడిల్లిన ప్రాణం

- రోడ్డు ప్రమాదం, సాయం కోసం మూడు గంటలు విలవిల
- చివరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

గుడ్లూరు : బైక్‌ను అడవి పందులు ఢీకొనడంతో యువకుడు రోడ్డుపై పడి తీవ్రగాయాల పాలయ్యాడు. అర్ధరాత్రి తరువాత ప్రమాదం జరగడంతో రోడ్డుపై ఎవరూ రాలేదు. దీంతో క్షతగాత్రుడు దాదాపు మూడు గంటల పాటు ప్రాణాలతో తల్లడిల్లిపోయాడు. చివరకు తెల్లవారుజామున చూసుకుని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. ఈ సంఘటన మండలంలోని గుడ్లూరు–పెద్దపవని ప్రధాన రహదారిలో చినలాటరఫి–నరసాపురం గ్రామాల మధ్య ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చినలాటరఫి గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన కొమరిగిరి శ్రీరాములు(34) జీవనోపాధి నిమిత్తం కావలి మండలంలోని జమ్ములపాళెంలో ఇటుకల బట్టీల వద్ద భార్యతో కలిసి పనిచేసుకుంటున్నాడు. చినలాటరఫిలో ఉన్న తల్లి అంకమ్మను చూసేందుకు ఆదివారం రాత్రి జమ్ములపాళెం నుంచి బైక్‌పై బయలుదేరాడు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో నరసాపురం దాటి కొంచెం ముందుకు రాగానే అడవిలో నుంచి పందులు ఒక్కసారిగా రోడ్డు మీదకు వచ్చి బైక్‌ను ఢీకొట్టాయి. దీంతో శ్రీరాములు రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో రహదారిపై వాహనాలు రాకపోవడంతో ఐదు గంటల వరకు అక్కడే ఉన్నాడు. తరువాత పొలాల్లోకి వెళ్తున్న రైతులు రోడ్డుపై పడి ఉన్న వ్యక్తిని చూసి గ్రామానికి చెందిన శ్రీరాములుగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని క్షతగాత్రుడిని 108లో కావలికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీరాములు(34) మృతిచెందాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. ఎస్సై ప్రసాదరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.


ఘటనా స్థలంలో శ్రీరాములు

దుఃఖం 'ఒక్కటే' మిగిలింది

'చిన్నప్పటి నుంచి గారాబంగా పెంచాం. కష్టాన్ని నమ్ముకుని కడుపులో పెట్టుకుని చూసుకున్నాం. చదువుల్లో రాణిస్తున్నారని పైసాపైసా కూడబెట్టుకుని పెద్ద చదువులు చదివించాలని నిశ్చయించాం. పెద్ద ఉద్యోగం చేసి మా పేరు నిలబెడతారని కలలుగన్నాం. చరమాంకంలో తోడుగా నిలుస్తున్నారని ఆశలు పెంచుకున్నాం. మిమ్మల్నే తలుచుకుని జీవితాలు నెట్టుకొస్తున్నాం. ఇంతలోనే మమ్మల్నందర్నీ వదిలి అనంతలోకాలకు వెళ్లిపోయారా నాయనా.. మేమెట్టా బతికేది తండ్రీ' అంటూ రోడ్డు ప్రమాదంలో ఒక్కగానొక్క కుమారులను పోగొట్టుకున్న తల్లిదండ్రుల గుండెలు పగిలేలా రోదించిన తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించింది. కుప్పం–పలమనేరు రహదారిలో ఆదివారం వేకువజాము జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు విగతజీవులు కావడం తీవ్ర విషాదాన్ని నింపింది.

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థుల దుర్మరణం
- ముగ్గురూ ఏకైక కుమారులే
- ఆస్పత్రి వద్ద మిన్నంటిన రోదనలు


ప్రమాదంలో ధ్వంసమైన కారు


కుప్పం ఏరియా ఆస్పత్రి వద్ద విలపిస్తున్న మృతుల తల్లిదండ్రులు

గుడుపల్లె : ఉన్నత చదువులు పూర్తయి త్వరలోనే ఉద్యోగాలు అందుకోవాలనున్న వారి ఆశలను విధి తుంచేసింది. చదువుల్లో రాణిస్తూ సమాజంలో ఉన్నతంగా రాణిస్తారని కలలుగన్న తల్లిదండ్రుల కలలను చిదిమేసింది. కుప్పం– పలమనేరు జాతీయ రహదారిలో ఆదివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు మృతి చెందడం విషాదాన్ని నింపింది. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, పెనుబర్తి గ్రామానికి చెందిన సుచింద్రారెడ్డి కుమారుడు శ్రీవికాస్‌రెడ్డి(21), అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు రెడ్డివారిపల్లె గ్రామానికి చెందిన సుబ్బరాయుడు కుమారుడు ప్రవీణ్(24) కుప్పం పీఈఎస్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతుండగా.. రాజంపేటకు చెందిన రమణయ్య కుమారుడు కల్యాణ్(20) మదనపల్లె మిట్స్ కళాశాలలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వీరు ముగ్గురూ మంచి స్నేహితులు. తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కుమారులు కావడంతో అల్లారుముద్దుగా పెంచారు. శనివారం సాయంత్రం మదనపల్లె నుంచి కుప్పం పీఈఎస్‌కు వచ్చిన కల్యాణ్.. ఆదివారం వేకువజాము 3 గంటల సమయంలో తన స్నేహితుని కారు తీసుకుని శ్రీవికాస్‌రెడ్డి, ప్రవీణ్‌తో కలిసి కుప్పానికి బయలుదేరారు. మార్గమధ్యంలో కుప్పం నియోజకవర్గం, గుడుపల్లె మండలం, చిన్నశెట్టిపల్లె వద్ద ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. గుడుపల్లె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కన్నీరుమున్నీరు

విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కుప్పం ఆస్పత్రికి చేరుకుని విగత జీవులుగా పడి ఉన్న తమ బిడ్డలను చూసి కన్నీరుమున్నీరుగా విలపించడం కలచివేసింది. తమపై ఎన్నో ఆశలు పెంచుకున్నామని, ఉన్నత చదువులు చదివి తమను ఉన్నతంగా చూసుకుంటారని ఆశపడ్డామని, ఇంతలో తమ ఆశలు తుంచేసి వెళ్లిపోయా రా నాయనా అంటూ గుండెలవిసేలా రోదించడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది.

అక్రమ కేసులు బనాయించింది శ్రీధర్‌రెడ్డే

- టీడీపీ నేతల ఆరోపణ

నెల్లూరు (టౌన్) : ఎలాంటి సంబంధం లేకుండా ఐదుగురు టీడీపీ నేతలపై రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అక్రమ కేసులు బనాయించారని టీడీపీ నేతలు ఆరోపించారు. నగరంలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో వారు ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి సాబీర్‌ఖాన్ మాట్లాడుతూ రూరల్ ఎమ్మెల్యేకు కుడి భుజంగా ఉన్న కార్పొరేటర్ నిజాలు బయటపెట్టారని, ఈ విషయంలో హరికుమార్‌ను విచారిస్తే కోటంరెడ్డి సోదరుల పేర్లు బయటకు వస్తాయన్నారు. అక్రమ కేసుల్లో ఇరుక్కున్న వారిలో ఎవరూ క్రిమినల్, గ్రూపు తగాదాలకు సంబంధం లేనివారు అని తెలిపారు. మాజీ కార్పొరేటర్ పెంచలనాయుడు మాట్లాడుతూ అక్రమ కేసులపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. నెల్లూరు పార్లమెంట్ మైనార్టీ ఉపాధ్యక్షుడు అల్లాభక్షు మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఎవరికీ చెప్పకుండా అమరావతికి వెళ్లి క్వాష్ పిటిషన్, ముందస్తు బెయిల్ పిటిషన్ ఎందుకు వేశారన్నారు. మా ఏడుగురిని అతని బారి నుంచి రక్షణ కల్పించాలని పోలీసులను వేడుకున్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ రాజానాయుడు, జలదంకి సుధాకర్, మాతంగికృష్ణ, రమేష్‌చౌదరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నేతలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	96
లేయర్ (లైవ్)	75
బ్రాయిలర్ చికెన్	174
బ్రాయిలర్ స్కిన్‌లెస్	194
లేయర్ చికెన్	128

పొదలకూరు



నిమ్మధరలు (కిలో)

పెద్దవి	రూ.70
సన్నవి	రూ.60
పండ్లు	రూ.30